క్లుప్తంగా...

నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

అఫ్జల్‌గంజ్: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన పోస్టర్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు బుధవారం ఆవిష్కరించనున్నట్లు కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ తెలిపారు. మంగళవారం అఫ్జల్‌గంజ్‌లోని తన కార్యాలయంలో మాట్లాడుతూ పొగాకు, గుట్కా, పాన్ మసాలా, తంబాకు, ధూమపానం వల్ల ఎదురయ్యే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్‌ను బుధవారం మంత్రి ఆవిష్కరిస్తారన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

అఫ్జల్‌గంజ్: ఆర్టీసీ సమస్యలు, సలహాలు, సూచనలు, ఫిర్యాదులపై బుధవారం డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి రీజియన్ పరిధిలోని ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్‌ల నుంచి బయలు దేరే జిల్లా సర్వీసులు, హైద్రాబాద్ డిపో 1, హైద్రాబాద్ డిపో2, పికెట్, మియాపూర్1, బిహెచ్‌ఈఎల్, పరిగి, తాండూర్, వికారాబాద్ డిపోలకు సంబంధించిన సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కొరకు సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు ఫోన్ నెంబర్ 9959226241లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు


పూజల్లో పాల్గొన్న మహంత్ రాహుల్ దాస్ బాబా తదితరులు

గోల్కొండ: నానల్‌నగర్ తిరుపల్లి గడ్డలోని శ్రీ కోవెల రంగనాయక స్వామి ఆలయంలో మంగళవారం దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవ పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. బ్రహ్మశ్రీ పాలెం మనోహర్ శర్మ నేతృత్వంలో దేవీ ఉపాసకులు ఎస్. రాజు వస్తాద్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు దేవతార్చన, మూలమంత్ర అవనం, మహానారాయణ లక్ష్మీనరసింహ సుదర్శన యాగం, స్వామి వార్లకు విశేష మహాపూజ, యంత్ర విగ్రహాలకు తిరుస్నపనము, హారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.

2. 3 తేదీల్లో గోల్కొండ కోటలో 'ఖిలా ఔర్ కహానియా'

గోల్కొండ: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జూన్ 2, 3 తేదీల్లో గోల్కొండ కోటలో 'ఖిలా ఔర్ కహానియా' ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆర్కియాలజిక్ సర్వే ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ డాక్టర్ స్మితా ఎస్ కుమార్ తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. జూన్ 2,3 తేదీల్లో సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ సౌజన్యంతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, 2న కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర అవతరణ సందర్భంగా పతాకావిష్కరణ చేస్తారని ఆమె వివరించారు.

ఆకట్టుకున్న సంగీత కచేరీ



గన్‌ఫౌండ్రీ: సౌత్‌ఇండియన్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు మంగళవారం రవీంద్రభారతిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత కచేరి ఆహుతులను ఆకట్టుకుంది. ప్రముఖ గాయని నిషా రాజగోపాలన్, గాయకుడు జె.ఎస్.శ్రీరామ్‌ల సంగీత కచేరీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ హైదరాబాద్ సర్కిల్ హెడ్ ఎస్‌వీఎస్‌పీ రెడ్డి, సికింద్రాబాద్ సర్కిల్ హెడ్ బీవీ నరేష్, సికా అధ్యక్షులు డాక్టర్ ఎస్. చక్రవర్తి, కార్యదర్శి ఎన్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరికరాల అందజేత

నాంపల్లి: 'అసోసియేషన్ ఫర్ ఏపీ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ సంస్థ' మంగళవారం రెడ్‌హిల్స్‌లోని చిన్న పిల్లల ఆసుపత్రి నిలోఫర్‌కు రూ. లక్ష విలువైన వైద్య పరికరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.ఉషా రాణికి అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు కె.నళిని మోహన్ కుమార్ మాట్లాడుతూ తాము అందించిన వైద్య పరికరాలు అప్పుడే పుట్టిన బిడ్డలకు శ్వాస అందించేందుకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు వి.వి.జనార్దన్ రావు, అదనపు కార్యదర్శి డి.మీరంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు అత్యాధునిక హంగులు


షేక్‌పేట్‌లో గ్రంథాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి తలసాని, ఎమ్మెల్యే మాగంటి తదితరులు

గోల్కొండ: ఆధునిక విజ్ఞాన కేంద్రాలైన గ్రంథాలయాలకు అత్యాధునిక హంగులు కల్పించి అందరికీ ఉపయోగంలోకి తేవడమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన జూబ్లీహిల్స్ నియోజకవర్గం, షేక్‌పేట్‌లో రూ.60 లక్షలతో చేపట్టిన నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ గత కొంత కాలంగా గ్రంథాలయాలకు వచ్చే పాఠకుల సంఖ్య తగ్గిపోతుందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం గ్రంథాలయాల్లో పాఠకులను ఆకర్శించేందుకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందుకుగాను భారీగా నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగుల కోసం ప్రతి గ్రంథాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి వారికి అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ముఖ్యమంత్రి గ్రంథాలయాల ఆధునికీకరణపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. స్వంత భవనాలు లేని గ్రంథాలయాలకు నూతన భవనాలు, శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయ భవనాల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకుగాను నగరంలో 14 గ్రంథాలయాలకు రూ.9.4 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. పోటీ పరీక్షల కోసం సిద్ధమయ్యే వారి కోసం అవసరమైన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రతి రోజూ ప్రజలు కనీసం ఒకసారైనా తమ సమీపంలోని గ్రంథాలయాలను సందర్శించేలా వాటిని తీర్చిదిద్దుతామన్నారు. విద్యార్థులకు సైతం వారికి అవసరమైన పుస్తకాలను ప్రధాన భాషలల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. రాష్ట్రంలో ప్రజలందరూ సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయమని, అందులో భాగంగానే ప్రభుత్వం సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ, మరోవైపు అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రేటర్ అధ్యక్షులు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రసన్న, కార్యదర్శి పద్మజ, బిఆర్‌ఎస్ షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షులు బి. ప్రదీప్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జీఎన్‌ఐటీఎస్ గ్రాడ్యుయేషన్ డే

గోల్కొండ: షేక్‌పేట్‌లోని జీ నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. 2వ అటానమస్ బ్యాచ్ 2019-23 సీఎస్సీ, ఐటీ బ్రాంచిలకు చెందిన విద్యార్థినులు పట్టాలు అందుకున్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ ఎమర్జింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి జీఎన్‌ఐటీఎస్ చైర్మన్ జి. రాఘవరెడ్డితో కలిసి విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ ప్రజలతో మమేకం కావడానికి నెట్‌వర్కింగ్ బిల్డింగ్ ఎంతో అవసరమన్నారు. జీ రాఘవరెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఉన్నతమైన సాంకేతిక విద్యను అందించడానికి టీఎస్‌ఐటీఎస్‌ను స్థాపించడం జరిగిందన్నారు. తమ కళాశాలలో చదువు పూర్తి చేసిన ఎందరో మహిళలు పలు కార్పొరేట్ కంపెనీల్లో అత్యున్నత స్థానాల్లో ఉన్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రమేష్ రెడ్డి, ఐటి విభాగం హెచ్‌ఓడి డాక్టర్ ఐ. రవి ప్రకాశ్ రెడ్డి, సిఎస్సీ హెచ్‌ఓడి డాక్టర్ ఎం. గీత, ఎం.వి. రమణారెడ్డి, డాక్టర్ జి.బి.ప్రతాప్ రెడ్డి, డాక్టర్ జి. చరణ్ సింగ్, డాక్టర్ జి. నరేందర్ బాబు తదితరులు పాల్గొన్నారు.


పట్టాలు అందుకున్న ఆనందంలో విద్యార్థినులు

అమ్మవారికి విజయారెడ్డి ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న విజయారెడ్డి, డాక్టర్ అనురాగిణి రెడ్డి.

యాకుత్‌పురా: పాతబస్తీ హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయ వజ్రోత్సవాల్లో భాగంగా మంగళవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి తన సోదరి డాక్టర్ అనురాగిణి రెడ్డితో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రార్థన మందిరంలో జరుగుతున్న నిత్య అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాద వితరణ చేసి, భక్తులతో కలిసి భోజనం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బోనాల వజ్రోత్సవాల సందర్భంగా 75 రోజుల పాటు ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అనురాగిణి రెడ్డి రూ.25 వేలు ఆలయ కమిటీకి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రాందేవ్ అగర్వాల్, ప్రతినిధులు సతీష్ కుమార్, కృష్ణ, వినోద్, శ్రీకాంత్, మహేష్, అరుణ్, రామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే వారికి పార్టీలో సముచిత స్థానం


మీర్జా ఎక్బాల్ అహ్మద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కష్టపని చేసే నాయకులు, కార్యకర్తలకు మజ్లిస్ పార్టీలో సముచిత స్థానం దక్కుతుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన సమతా కాలనీ, మజ్లిస్ నాయకుడు కుతుబ్‌షాహీ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు మీర్జా ఎక్బాల్ అహ్మద్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... మీర్జా ఎక్బాల్ అహ్మద్ ఎన్నో ఏళ్లుగా మజ్లిస్ పార్టీలో క్రియాశీలక నాయకుడిగా పని చేస్తున్నారన్నారు. బల్దియా, అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ అభ్యర్థుల విజయానికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయనను కార్యకర్తలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇటీవల పవిత్ర ఉమ్రా యాత్ర పూర్తి చేసుకుని వచ్చిన మీర్జా ఎక్బాల్ అహ్మద్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు ఎ.కె.పఠాన్, హారూన్ ఫరాన్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మ రక్షణ


సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ అల్లం విజయరాణి

విజయనగర్‌కాలనీ: విద్యార్థినులు, యువతులు ఆత్మరక్షణ పెంపొందించుకునేందుకు కరాటే దోహద పడుతుందని విజయనగర్‌కాలనీ సెయింట్ ఆన్స్ బాలికల ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ అల్లం విజయరాణి, కరాటే మాస్టర్ జొన్నగల శ్రీధర్ అన్నారు. పాఠశాల ఆవరణలో నెల రోజులుగా కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కరాటే శిక్షణలో విజయం సాధించిన విద్యార్థినులకు మంగళవారం ప్రశంసా పత్రాలు, మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో సమ్మర్ క్యాంప్ కో ఆర్డినేటర్ నీలిమ, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు


ఎర్మని కైలాష్ గంగపుత్ర

గౌలిపురా: ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరీ, భారతమాత దేవాలయం, శ్రీ కోట మైసమ్మ దేవాలయం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మాజీ అధ్యక్షులు ఎస్.మల్లేషం గౌడ్ అధ్యక్షతన దేవాలయం ప్రాంగణంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో కమిటీ నూతన అధ్యక్షుడిగా ఎర్మని కై లాష్ గంగపుత్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. దేవాలయ కమిటీ ముఖ్య సలహాదారుగా ఎస్.మల్లేషం గౌడ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షులు ఆలె భాస్కర్ రాజ్, మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర, జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, మామిడి కృష్ణ, ఆనంద్, మధుసూదన్ గిరి, బి.వై.శ్రీకాంత్, బొడ్డు సాయిబాబా, రామకృష్ణ, ఇ.సుమన్ కుమార్, ఎ.శివచంద్రగిరి, ప్రకాశ్, జానకీరామ్, డల్లు శివ, రిషికేశ్, రాము గౌడ్ పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న నూతన అధ్యక్షుడు ఎర్మని కైలాష్, ఆలె భాస్కర్ రాజ్

బాలుడి అదృశ్యం


అబ్దుల్లా (ఫైల్)

డబీర్‌పురా: మతిస్థిమితం లేని బాలుడు అదృశ్యమైన సంఘటన మంగళవారం రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అంబర్‌పేట్ గోల్నాక డీ-మార్ట్ ప్రాంతానికి చెందిన సాదియా బేగం గత నెల 9న తన కుమారుడు అబ్దుల్లా (17)తో కలిసి భిక్షాటన చేసేందుకు యాకుత్‌పురాకు వచ్చింది. అదే రోజు సాయంత్రం నీళ్లు తీసుకువస్తానని నౌషాద్ చౌరస్తాకు వెళ్లిన అబ్దుల్లా తిరిగి రాలేదు. అతడి కోసం గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో తన కుమారుడు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సమస్యల పరిష్కారానికే పాదయాత్రలు


సమస్యలు తెలుసుకుంటున్న దేవర శ్రీనివాస్, వంశీ తదితరులు

గోల్కొండ: స్థానిక సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు బీజేపి నాయకులు దేవర శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన పార్టీ నేతలతో కలిసి గుడిమల్కాపూర్ డివిజన్ పరిధిలోని బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ అకాల మరణం తర్వాత తమ సమస్యలను పట్టించుకునేవారు కరువయ్యారని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము ప్రజల వెంట ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని, ఇందుకు కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి సహాయం తీసుకుంటామని దేవర వంశీ పేర్కొన్నారు.

భార్యపై దాడికి పాల్పడిన వ్యక్తికి జైలు

డబీర్‌పురా: భార్యపై దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 21 రోజుల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్ రావు తీర్పు చెప్పారు. డబీర్‌పురా పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో సమీరా ఫాతిమా, మహ్మద్ ఖలీమ్ దంపతులు నివాసం ఉంటున్నారు. గత కొన్నాళ్లుగా మహ్మద్ ఖలీం భార్య సమీరా ఫాతిమాతో అనవసరంగా గొడవపడుతూ ఆమెపై దాడికి పాల్పడ్డాడు. దీనిపై సమీరా ఫాతిమా డబీర్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఖలీమ్‌ను అరెస్ట్ చేసి మంగళవారం కోర్టులో హాజరు పరిచారు. విచారణ చేపట్టిన నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్ రావు నిందితుడు మహ్మద్ ఖలీంకు 21 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న డీహెచ్ శ్రీనివాసరావు

సుల్తాన్‌బజార్: తెలంగాణ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నికైంది. ఈ మేరకు మంగళవారం డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా భరత్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా బానోత్ నెహ్రూచంద్ నాయక్, కోశాధికారిగా టి.చంద్రశేఖర్, అసోసియేట్ అధ్యక్షులుగా బాబులాల్ రాథోడ్, ఉపాధ్యక్షులుగా మధుసూదన్ రెడ్డి, సునీత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రఫీక్, సోమయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మల్లేష్ యాదవ్‌కు సత్కారం


మల్లేష్ యాదవ్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకుడు కె.వెంకటేష్

సుల్తాన్‌బజార్: కరాటేలో గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా టెక్నికల్ డైరెక్టర్ మల్లేష్ యాదవ్‌ను రాష్ట్ర రాజీవ్ సేవా సమితి అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు కె.వెంకటేష్ ఘనంగా సత్కరించారు. మంగళవారం కోఠిలో జరిగిన కార్యక్రమంలో మల్లేష్ యాదవ్‌ను సన్మానించారు. ఎందరో విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా కరాటే శిక్షణ ఇస్తూ క్రీడాకారులకు మల్లేష్ యాదవ్ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో మహ్మద్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు..



నాంపల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని ఉద్యమ సమయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని టీజీఓ అధ్యక్షురాలు వి.మమత అన్నారు. ఈ మేరకు మంగళవారం కాంట్రాక్టు అధ్యాపకులు తమ రెగ్యులరైజేషన్‌కు టీజీఓ అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ.. కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణతో తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని మరోసారి నిరూపించుకుందన్నారు. కార్యక్రమంలో టీజీఓ నగర శాఖ అధ్యక్షులు డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు ఎం.బి.కృష్ణ యాదవ్, జూనియర్ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షులు అస్నాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు


డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: ప్రజా సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించి వాటి పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ పార్టీ అధినేత ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాలా, డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలించి వేగంగా పూర్తి చేయాలని అధికారులను కోరమన్నారు. వర్షాకాలంలో వరద నీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ వసీముద్దీన్, ఏరియా కమిటీ అధ్యక్షులు, జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

వ్యాపారులకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం


మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నందకిశోర్‌వ్యాస్ బిలాల్ తదితరులు

అబిడ్స్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యాపారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని గోషామహల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌ఛార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ అన్నారు. వ్యాపారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంగళవారం ఆయన ఫీల్‌ఖానాలో వ్యాపారుల కోసం నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ రహ్మత్‌బేగ్, బేగంబజార్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పూజవ్యాస్ బిలాల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులను కలిసి కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. వ్యాపారులకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, వారికి ఎలాంటి సమస్యలు ఉన్నా ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, ప్రదీప్‌రాజ్, శంకర్ సింగ్ జమేదార్, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ ఒక నూతన అధ్యాయం

నేడు ముగింపు వేడుకలు..



పవర్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయ గౌడ్

గన్‌ఫౌండ్రీ: సీఎం కప్ రాష్ట్ర క్రీడా చరిత్రలో ఒక నూతన అధ్యాయమని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ అన్నారు. తెలంగాణ క్రీడాశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సీఎం కప్ పోటీల పర్యవేక్షణలో భాగంగా మంగళవారం ఆయన ఎల్బీ స్టేడియంతో పాటు పలు స్టేడియాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆంజనేయ గౌడ్ మాట్లాడుతూ.... సీఎం కప్ పోటీలతో గ్రామీణ క్రీడాకారుల్లో నూతన చైతన్యం వచ్చిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాస్ఫూర్తి చాటిందని, రాష్ట్రంలో యువ ఛాంపియన్లు వెలుగులోకి వచ్చారన్నారు. యేటా సీఎం కప్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 31న నగరంలోని 6 స్టేడియాలలో ముగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎల్బీస్టేడియంలో జరిగే వేడుకలకు మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్ గౌడ్, సరూర్‌నగర్ స్టేడియంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, జీఎంసీ బాలయోగి స్టేడియంలో సబితా ఇంద్రారెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, జింఖానా గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు, నగదు, ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు.



టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలు

అబిడ్స్: టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని అన్నారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 2న పతాకావిష్కరణ వేడుకలు, కార్యాలయం నుంచి గన్‌పార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. 9న ఉద్యోగులతో పలు అంశాలపై సదస్సు నిర్వహిస్తామన్నారు. 22న అమరవీరుల సంస్మరణ, ఉద్యమకారులను సన్మానించనున్నట్లు తెలిపారు.